క్లుప్తంగా

గుంతకల్లులో భారీ వర్షం



గుంతబావి వద్ద జలమయమైన అండర్ బ్రిడ్జి

గుంతకల్లుటౌన్: పట్టణంలో శనివారం ఉదయం సూర్యుడు సెగలు కక్కాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం దంచి కొట్టింది. భారీ వర్షం పలు మురికివాడలు, శివారు కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. గుంతబావి వీధి, ఎస్‌ఎన్.పేట రైల్వే అండర్ బ్రిడ్జిల కింద వర్షపునీరు నిలిచిపోవడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇక విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడటంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.

పామిడి: పామిడిలో శనివారం సాయంత్రం గంటపాటు ఓ మోస్తరు వర్షం పడింది. ఈదురుగాలులకు డాబారేకులు ఎగిసిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు.

భోగేశ్వరాలయ గోపుర పునర్నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయ గోపుర పునర్నిర్మాణానికి ఆలయ ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ సమక్షంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎస్ మురళీధర్‌గుప్తాకు శనివారం ఆయన కుమారులు శివశంకర్, రాజీవ్ రూ.2 లక్షలు చెక్కును విరాళంగా అంజేశారు. స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ఆ చెక్కును ఆలయ ఖాతాకు జమ చేశారు. ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలని ఆలయ చైర్మన్ కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి రవికుమార్‌నాయుడు

తాడిపత్రి టౌన్ : గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ నాగరాజు విద్యార్థులకు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులు ముగిశాయి. పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. కథల పుస్తకాలు, మహానుభావుల జీవిత చరిత్రలు, సైన్స్, క్విజ్, పురాణాలు తదితర పుస్తకాల విశిష్టతను గ్రంథాలయాధికారి రవికుమార్‌నాయుడు వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు వీరారెడ్డి, రామకేశవరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పర్‌భద్ర ప్రాజెక్టు ఆపాలి

పెద్దవడుగూరు : తుంగభద్ర నదిపై కర్ణాటక నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌ను ఆపాలని సీపీఐ సీనియర్ నాయకులు ఎద్దుల సూర్యనారాయణరెడ్డి, తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, శింగనమల నియోజకవర్గ కార్యదర్శి టి.నారాయణస్వామి పేర్కొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టి రైతుగర్జన జీపు జాతా శనివారం పెద్దవడుగూరుకు చేరింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హెచ్చెల్సీ ఆధునీకరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువ కెపాసిటీని పెంచాలని కోరారు. రైతులకు సకాలంలో పంట నష్ట పరిహారం చెల్లించి, రుణమాఫీ చేయాలని కోరారు. రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరారు. సీపీఐ నాయకులు వెంకట్రాముడుయాదవ్, పోలా రంగస్వామి, లింగన్న, నారాయణ, ఉసేన్‌పీరా, సుధాకర్‌గౌడ్, ముత్యాల్‌రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శ్రీరామనామ సంకీర్తన



పూజలందుకున్న కోదండరాముడు

అనంతపురం కల్చరల్: అఖండ శ్రీరామనామ సంకీర్తనతో రెవెన్యూ కాలనీ కోదండరామాలయం మార్మోగింది. ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు శ్రీరామ..జయరామ అంటూ భక్తబృందాలు స్వామి నామాన్ని జపించారు. శనివారం లోక కల్యాణార్థం ఆలయంలో అఖండ శ్రీరామనామ సంకీర్తనను విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో ప్రారంభించారు. సాయంత్రం ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య బృందం కోలాటంతో భక్తిగీతాలు ఆలపిస్తూ స్వామికి నీరాజనాలర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రామయ్య గుప్తా, మెకవాయి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ అఖండ రామనామ సంకీర్తనను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం లక్ష్మణ సమేత సీతారామాంజనేయులుకు అలంకార సేవలు, అభిషేకాలు, తీర్థప్రసాద వితరణ చేశారు.

జగనన్న విద్యా కానుక సిద్ధం

- రేపు 9,374 మంది విద్యార్థులకు పంపిణీ
- పాఠశాలలకు సరఫరా చేసిన అధికారులు

తాడిపత్రి టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నారు. నాడు–నేడు కింద కోట్లాది రూపాయలు వెచ్చించి పాఠశాలలను అందంగా తీర్చిదిద్దారు. అలాగే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, షూ, బెల్టు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, టైతో కూడిన జగనన్న విద్యాకానుక కిట్లను సిద్ధం చేశారు. పాఠశాల పునః ప్రారంభం రోజున వాటిని విద్యార్థులకు ఇవ్వనున్నారు. తాడిపత్రి పట్టణ, రూరల్ పరిధిలోని 60 ప్రాథమిక, 12 ప్రాథమికోన్నత, 15 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. ఇందులో 9,374 మంది విద్యార్థులు చదువుతున్నారు.



పంపిణీకి సిద్ధంగా ఉంచిన పాఠ్య పుస్తకాలు

కార్పొరేట్ దీటుగా విద్య

ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడంతోపాటు ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో అపారమైన అనుభజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నారు. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇక 8 తరగతి విద్యార్థులకు ట్యాబ్ అందిచడంతోపాటు బైజూస్ కంటెంట్ అందుబాటులోకి తెచ్చారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలో 32 పాఠశాలల్లో మొదటి, రెండో విడతల్లో రూ 13.51 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. అదనపు గదులు, ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా తాగునీరు, విద్యార్థులకు మరుగుదొడ్లు, గదుల మరమ్మతు, విద్యుత్ సదుపాయం, ఫర్నీచర్, బ్లాక్‌టూ గ్రీన్ బోర్డు , పాఠశాల ప్రహరీ నిర్మాణం తదితర పనులు చేపట్టారు.



సుధా శ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో నాడు-నేడు కింద నిర్మించిన మరుగుదొడ్లు

12న జేవీకే కిట్లు పంపిణీ



తాడిపత్రి పట్టణ, రూరల్ పరిధిలోని 87 పాఠశాలల్లోని 9,374 మంది విద్యార్థులకు పాఠశాలలు పున : ప్రారంభం రోజున జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మున్సిపాలిటీ పరిధిలో నాడు–నేడు మొదటి, రెండవ విడతల్లో 32 పాఠశాలలో అభివృద్ధి పనులు జరిగాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– నాగరాజు, ఎంఈఓ, తాడిపత్రి

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

గుత్తి రూరల్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని గుత్తి ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు అబూబకర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు ఒకటో తారీఖున పింఛన్ ఇవ్వాలన్నారు. ప్రతి పింఛన్‌దారు తమ ఖాతాలను ఈ ఫైలింగ్ చేయించుకోవాలని, లేని పక్షంలో అదనపు జరిమానా విధించే ప్రమాదం ఉందన్నారు. నాయకులు లక్ష్మీనారాయణ, కుళ్లాయి బాబు, రామ్మోహన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గార్లదిన్నె: కనంపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు..కనంపల్లికి చెందిన జ్ఞానేశ్వర్ బైక్‌పై కనంపల్లి క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు ఢీకొంది. ఘటనలో జ్ఞానేశ్వర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం





పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పుట్లూరు: మండలంలోని సి.వెంగన్నపల్లి గ్రామంలో శనివారం ఉమామహేశ్వరస్వామి ఆలయ మూడవ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నా రు. ఈ సందర్భంగా ఎంపీ తలారి రంగయ్య, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ప్రభుత్వ విద్యసలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభించారు. పోటీలలో గెలుపొందిన వృషభాల యజమానులకు బహుమతులు అందజేశారు.



వృషభాల యజమానికి బహుమతి అందిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, ఎంపీపీ రాఘవరెడ్డి

నిజమైన అభివృద్ధిని ప్రజలు చూస్తున్నారు

- ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుత్తి రూరల్: రాష్ట్ర ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నిజమైన అభివృద్ధి అంటే ఏమిటో చూస్తున్నారని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. గుంతకల్లు మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డితో కలిసి బసినేపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడప వద్దకూ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధికి సంబంధించిన కరపత్రాలను మహిళలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ పారదర్శకంగా అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తున్నారన్నారు. జగనన్న చేసే పరిపాలన చేసి కేంద్ర ప్రభుత్వం మెచ్చుకుంటుంటే ఇక్కడ చంద్రబాబు అండ్ కో కడుపు మంటతో రగిలిపోతోందన్నారు.

విషం చిమ్ముతున్న ఎల్లో మీడియా

ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని ఎవరో చిల్లరగాల్లు వాగే సొల్లు రోజంతా చూపిస్తూ జగన్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ఎంత సేపూ రాష్ట్రమంతా ఎవరేం మాట్లాడుతున్నారు ఎవరేం చేస్తున్నారని జల్లెడ పట్టేస్తున్నారన్నారు. ఎవరైనా చిన్నమాట అంటే చాలు రాబందుల్లా వాలిపోతున్నారని విమర్శించారు. అందుకే జగనన్న వారిని మారీచులతో పోల్చారన్నారు. చంద్రబాబు శంకుస్థాపన చేస్తాడు కానీ ప్రారంభించరన్నారు. కానీ జగనన్న ప్రారంభించి పనులు చేసి చూపిస్తున్నారని, వీరిలో ఎవరు గొప్పవారో ప్రజలే తెలుసుకోవాలన్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో తాము ఓడిపోతామని దుష్టచతుష్టయం డిసైడ్ అయిపోయిందని, అందుకే చిలువలు, పలువలు చేసి ఎల్లో మీడియా కథలు అల్లుతోందన్నారు. ప్రజల అండ ఉన్నంత కాలం జగనన్నను వారేమీ చేయలేరన్నారు. పేదవారిని ఆదుకునే జగనన్న పదికాలాలు ఉంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మౌలాలమ్మ, అనారోగ్యంతో బాధపడుతున్న అనసూయమ్మ అనే మహిళలకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం అందజేశారు. సర్పంచ్ మహబూబ్‌బీ, ఎంపీటీసీ శంకరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాష్‌రెడ్డి, షెక్షావలి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు రాజ్ కుమార్‌రెడ్డి, గురుప్రసాద్ యాదవ్, నాయకులు నాగరాజు, శివరంగనాయకులు, తిమ్మారెడ్డి, శ్రీరాములు, హనుమంతు, హుస్సేన్, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బోయ తిరుపతయ్య, భాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మురళీరెడ్డి, మస్తాన్, స్థానిక నాయకులు రాము, జగదీష్, బిల్లి కొండ, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బసినేపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

పోలీసులకు ఆరోగ్యమూ ముఖ్యమే



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న పోలీసు అధికారులు

తాడిపత్రి: పోలీసులకు వృత్తితోపాటు ఆరోగ్యమూ ముఖ్యమేనని డీఎస్పీ గంగయ్య పేర్కొన్నారు. శనివారం కడప రోడ్డులోని టంగుటూరి ఫంక్షన్‌హాల్‌లో కర్నూలు మెడికేర్ ఆసుపత్రి, తాడిపత్రి ప్రభుత్వాసుపత్రి వైద్యులతో తాడిపత్రి సబ్ డివిజన్‌లోని పోలీసుల సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బీపీ, షుగర్, ఈసీజీ తదితర వ్యక్తిగత ఆరోగ్య పరీక్షలను నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం డీఎస్పీ కర్నూలు మెడికేర్ వైద్య, సిబ్బందితో పాటు తాడిపత్రి ప్రభుత్వాసుపత్రి వైద్య సిబ్బందిని పూలమాల, శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో తాడిపత్రి రూరల్, అర్బన్, యాడికి సీఐలు చిన్న పెద్దయ్య, ఆనందరావు, శంకర్ రెడ్డి, ఎస్‌ఐలు ధరణీబాబు, మహమ్మద్ గౌస్, గురుప్రసాద్‌రెడ్డి, ఖాజాహుస్సేన్, శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

- రూ.2.4 లక్షల విలువైన నగల స్వాధీనం

తాడిపత్రి అర్బన్: వివిధ చోరీ కేసుల్లో ఉన్న నిందితుడిని పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.2,40,000 విలువైన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు డీఎస్పీ సిఎం గంగయ్య శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ, ఎస్‌ఐలతో కలిసి వివరాలు వెల్లడించారు. ఈనెల 2న పట్టణంలోని రెడ్డివారిపాలెంలో వడ్డే దేవి అనే మహిళ మెడలో నుంచి 3 తులాల బంగారు గొలుసు అపహరించారు. అలాగే గన్నెవారిపల్లి కాలనీలో ఈనెల 6న ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయం స్ట్రాంగ్ రూంను పగులగొట్టే ప్రయత్నం జరిగింది. ఈనెల 9న శ్రీనివాసపురంలోని లింగుట్ల గోవిందమ్మ అనే మహిళ మెడలో నుంచి ఒక తులం బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. పోలీసులు జరిగిన ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో పట్టణంలోని నందలపాడు సమీపంలోని కమ్యూనిస్టు కొట్టాలకు చెందిన గంజి అమర్‌నాథ్‌ను శనివారం అనంతపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో అరెస్టు చేశారు. విచారణలో తనే చోరీలు చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. ఈసందర్భంగా పోలీసులు అతడి నుంచి రూ.2,40,000 విలువ గల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుళ్లు భాస్కర్, రిజ్వాన్‌ను డీఎస్పీ అభినందించారు.



నిందితుడితో డీఎస్పీ గంగయ్య, సిబ్బంది

15 నుంచి తరిమెలలో క్రికెట్ టోర్నీ

శింగనమల: తరిమెల గ్రామంలో కంచిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధా, వైఎస్సార్‌సీపీ నాయకుడు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో ఈనెల 15 నుంచి నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కుమార్, మారుతి, మాధవ్ తెలిపారు. ఆసక్తి ఉన్నక్రీడాకారులు ఈనెల 14లోపు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. విజేతలకు వరుసగా రూ.25,116, రూ.15,116, రూ.10,116 నగదు బహుమతి అందిస్తామన్నారు.

నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి టౌన్: స్థానిక కడప రోడ్డులోని హెచ్‌పీ గ్యాస్ కార్యాలయంలో శనివారం పట్టణానికి చెందిన ఐదుగురు పేద బుద్ధిమాంద్యం పిల్లల కుటుంబాలకు హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు ఓబులేసు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఐదు నెలల నుంచి నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నట్లు ఓబులేసు తెలిపారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

యాడికి: స్థానిక మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశానికి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మారుతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులు తమ హాల్ టికెట్‌తో హాజరుకావాలని సూచించారు.

పామిడి: పామిడి మోడల్‌స్కూల్‌లో ఆదివారం ఆరో తరగతి ప్రవేశానికి రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ శనివారం తెలిపారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

పుట్లూరు: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోకి ఆరో తరగతి ప్రవేశం కోసం ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆస్మాసయోద శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్‌ను డౌన్లోడ్ చేసుకుని ఉదయం 9 గంటలకు ఆదర్శ పాఠశాల వద్దకు చేరుకోవాలని సూచించారు.

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో ఆరో తరగతి ప్రవేశం కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులు బ్లూ, బ్లాక్ బాల్ పెన్ను మాత్రమే వాడాలన్నారు. పరీక్ష సమయంలో హాల్ టికెట్ ఇన్విజిలేటర్‌కు చూపించాలన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

యల్లనూరు: కూచివారిపల్లి గ్రామదేవత గంగమ్మ అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ జాతరలో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అర్చనలు, అభిషేకాలను చేశారు. మంగళవారం రోజున అమ్మవారికి బలిదానం చేయనున్నారు. గ్రామంలో మూడు రోజుల పాటు గంగమ్మ ఉత్సవాలు జరుగనున్నాయి. గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా ఎస్ఐ రామకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

పల్లెల్లో సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు

యల్లనూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు శాంతియుతంగా ఉండాలని సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. శనివారం యల్లనూరు, అచ్యుతాపురం, వాసాపురం, బుక్కాపురం, కూచివారిపల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎస్ఐ మాట్లాడుతూ ఏవైనా చిన్నపాటి సమస్యలు తలెత్తితే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఊరుకోమన్నారు.

ఇంటాక్‌లో విద్యార్థుల భాగస్వామ్యం పెంచాలి

అనంతపురం కల్చరల్: ఇంటాక్ (భారతీయ కళలు, వారసత్వ పరిరక్షణ సంస్థ)లో విద్యార్థుల భాగస్వామ్యం పెంచేలా విద్యాసంస్థల్లో విస్తృత ప్రచారం చేయాలని ఇంటాక్ అధ్యక్షుడు రామ్‌కుమార్ అన్నారు. శనివారం సంస్థ కార్యాలయంలో ఇంటాక్ సర్వసభ్య సమావేశం జరిగింది. రామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్‌నారాయణ, మాజీ అధ్యక్షుడు ఏజీ వేణుగోపాలరెడ్డి, రైతు సంఘం నాయకుడు కొసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కవులు నబీరసూల్, జూటూరు షరీఫ్, మాజీ డిప్యూటీ డీఈవో ఖాశింఖాన్, చిత్ర దర్శకుడు రషీద్ తదితరులు ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు. తొలుత ఇటీవల మరణించిన కవి, సామాజిక వేత్త గోళ్ల దత్తాత్రేయ శర్మ మృతికి సంతాపం తెలియజేశారు. ఆయన సాహిత్యంలో చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులకు చేరాల్సిన సర్టిఫికెట్లను సభ్యులకందించారు.

మెయిన్ పైప్‌లైన్ ఏర్పాటుకు మోక్షమెప్పుడో?

- మూడు నెలలవుతున్నా పూర్తి కాని పనులు
- రోడ్డుపై గుంతలు తవ్వడంతో రాకపోకల బంద్
- తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న ప్రజలు

గుంతకల్లుటౌన్: సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నుంచి మోదినాబాద్, కసాపురం రోడ్డు చివరి వరకు తాగునీటిని సరఫరా చేయడానికి ఏర్పాటు చేయనున్న మెయిన్ పైప్‌లైన్ ఏర్పాటు పనులు నత్తనడకన సాగుతున్నాయి. పైప్‌లైన్ ఏర్పాటు కోసం ధర్మవరం రైల్వేగేట్ పక్కనున్న మున్సిపల్ వాటర్ ట్యాంక్‌కు వెళ్లే దారిలో పెద్ద గుంతను తవ్వడంతో 3 నెలలుగా నిత్యం రద్దీగా ఉండే ఆ రోడ్డులో రాకపోకలు నిలిపివేశారు. అసలే ప్రతి అరగంటకోసారి రైలు గేట్ పడటం, రైలు రైల్వేస్టేషన్‌లోకి వెళ్లే వరకు గేటును తీయకపోవడంతో ప్రజలు గేట్ వద్ద 20 నిమిషాల పాటు పడిగాపులు కాస్తున్నారు. రైల్వే గేటుకిరువైపులా ట్రాఫిక్ భారీగా స్తంభిస్తుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వివరాల్లోకెళితే.. పట్టణ శివార్లోని కాలనీలకు సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌ల నుంచి నీటిని అందించడానికి గానూ ప్రభుత్వం అమృత్ పథకం ఫేస్–2 కింద మెయిన్ పైప్‌లైన్ల ఏర్పాటు, 5 ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణానికి రూ.10.98 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పనులను పూర్తి చేయడంలో అలసత్వం ప్రదర్శించారు. ఈ పనులను పర్యవేక్షిస్తున్న పబ్లిక్‌హెల్త్ అధికారులు కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో ఎప్పుడో పూర్తి కావాల్సిన పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు ఈ అంశంపై పదే పదే ప్రశ్నించడంతో మున్సిపల్ కమిషనర్ సదరు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి పనులను షురూ చేయించారు. ప్రస్తుతం గుంతకల్లు–కల్లూరు రైలు మార్గం కింద భాగాన 23 మీటర్ల మేర మెయిన్ పైప్‌లైన్ వేయాల్సి ఉంది. ఈ పైప్‌లైన్ ఏర్పాటుకు మున్సిపల్ వాటర్ ట్యాంక్‌కు వెళ్లే రహదారిలో పెద్ద గుంతను తవ్వడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. మూడునెలలు కావస్తున్నా ఇప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా పబ్లిక్‌హెల్త్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి సకాలంలో పనులు పూర్తి చేయించి జటిలంగా మారిన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నత్తనడకన సాగుతున్న పైప్‌లైన్ పనులు



మూడునెలలుగా రహదారిని బంద్ చేసిన దృశ్యం

బండరాయితో పనులు ఆలస్యం

ధర్మవరం రైల్వేగేట్ వద్ద రైలు మార్గం ఇరువైపులా 23 మీటర్ల పైప్‌లైన్ వేయాల్సి ఉంది. ఇప్పటివరకు 10 మీటర్లు వేశాం. బండరాయి పడటంతో హైడ్రాలిక్ టన్నెలింగ్ సిస్టమ్ ద్వారా బండరాయిని పగులగొట్టిస్తున్నాం. దీనికి తోడు రైల్వే అధికారులు మాకు సహకరించడం లేదు. అందువల్లే పనులు పూర్తి చేయడానికి ఆలస్యమవుతోంది. వారంరోజుల్లోగా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– కె.సుమ, పబ్లిక్‌హెల్త్ ఏఈ, గుంతకల్లు